


## ఫోక్స్‌వ్యాగన్ గోల్ఫ్ జీటీఐ మాడల్

న్యూఢిల్లీ, మే 27: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఫోక్స్‌వ్యాగన్...దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. నూతన గోల్ఫ్ జీటీఐ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ ధరను రూ.53 లక్షలుగా నిర్ణయించింది. ప్రీమియం విభాగాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఫోక్స్‌వ్యాగన్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ నితిన్ కోహ్లీ తెలిపారు. 12.9 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, 10.2 ఇంచుల డిజిటల్ కాక్‌పిట్, అన్ని కాలలను కంట్రోల్ చేసుకునే విధంగా టెక్నాలజీ, ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, లెవల్-2 అడాస్‌తో పాటు మరిన్ని ఫీచర్స్‌తో ఈ కారును తీర్చిదిద్దింది. కేవలం 5.9 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 250 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

# ఐటీ రిటర్నుల గడువు పెంపు

## సెప్టెంబర్ 15 వరకు పెంచిన సీబీడీటీ




న్యూఢిల్లీ, మే 27: ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఐటీ శాఖ శుభవార్తను అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ చెల్లింపులు గడువును సెప్టెంబర్ 15 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో అసెస్‌మెంట్ ఏడాది (ఏవై) 2025-26కిగాను జూలై 31 వరకు ఉన్న గడువును మరో నెలన్నర పెంచినట్టు అయింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. ఐటీఆర్‌లో మార్పులు చోటు చేసుకోవడం, యుటిలిటీ వ్యవస్థ అమలుకు అవసరమైన సమయాన్ని పరిగణనలోకి తీసుకున్న సీబీడీటీ ఐటీ గడువును పొడిగించింది. పన్ను చెల్లింపుదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఐటీ రిటర్నులు దాఖలు చేయడానికి ఐటీ శాఖ నిరంతరంగా కృషి చేస్తున్నదని, దీంట్లోభాగంగానే ఐటీ ఫామ్‌లో పలు మార్పులు చేసింది. ఈ నోటిఫై చేసిన ఐటీ ఫామ్‌తో చెల్లింపుదారులు సులభతరంగా, పారదర్శకతను పెంచడం, ఖచ్చితమైన సమాచారం అందించాలనే ఉద్దేశంతో సీబీడీటీ పలు మార్పులు చేసిన విషయం తెలిసిందే. ఐటీఆర్ ఫారాల నోటిఫికేషన్ జారీ ఆలస్యం కావడమే ఇందుకు కారణమని తెలిపింది. '2025-26 మదింపు సంవత్సరానికిగాను నోటిఫై చేసిన ఐటీఆర్ ఫారాల్లో చేపట్టిన మార్పులకు అనుగుణంగా టెక్నాలజీని అప్‌డేట్ చేయడానికి సమయం పట్టింది. పన్ను చెల్లింపుదారులు ఎలాంటి అవాంతరాలు లేకుండా రిటర్నులు ఫైల్ చేయడం కోసం ఈ గడువును పెంచినట్టు ఐటీ శాఖ తన ఎక్స్‌లో పేర్కొంది.

### రూ.50 లక్షల లోపు ఆదాయం..

రూ.50 లక్షల లోపు ఆదాయం కలిగిన వ్యక్తిగత, హెచ్‌యూఎఫ్‌లు ఫామ్-1, 4తో ఐటీ రిటర్నులు దాఖలు చేయాల్సివుంటుంది. ప్రస్తుతం ఈక్విటీల నుంచి రూ.1.25 లక్షల వరకు దీర్ఘకాలిక మూలధన లాభాలు పొందిన సంస్థలు అటువంటి ఆదాయాన్ని ఐటీఆర్ 1, 4 ఫామ్‌లో చూపించుకోవచ్చును. గతంలో వీరు ఐటీఆర్-2ను దాఖలు చేయాల్సివుండేది. దీంతోపాటు 80సీ, 80జీజీ, ఇతర సెక్షన్ల కింద డిడక్షన్ క్లెయింకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. సాధారణంగా, ఐటీఆర్ ఫామ్‌లను ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా నోటిఫై చేస్తుండగా, ఈసారి మాత్రం నూతన ఆదాయ పన్ను చట్టం ప్రవేశపెట్టడంతో ఆలస్యమైందని, దీంతో ఐటీ ఫామ్‌లలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయని సీబీడీటీ వర్గాలు పేర్కొన్నాయి.



## భారీగా తగ్గిన పుత్తడి

న్యూఢిల్లీ, మే 27: గత నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు భారీగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టడంతో దేశీయంగా దిగొచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.800 దిగొచ్చి రూ.98,500గా నమోదైంది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.800 దిగొచ్చి రూ.98 వేలుగా నమోదైంది. బంగారంతోపాటు వెండి ధరలు కూడా భారీగా దిగొచ్చాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.1,370 తగ్గి రూ.99 వేలుగా నమోదైంది. ఔన్స్ గోల్డ్ ధర 45 డాలర్లు కరిగిపోయి 3,296.92 డాలర్లుగా నమోదైంది.

## ఎన్ఎండీసీ ఆశాజనకం

న్యూఢిల్లీ, మే 27: ఎన్ఎండీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు నమోదు చేసుకున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.1,482 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఇనుప ఖనిజం, పెల్లెట్లు అత్యధికంగా అమ్మకాలు నమోదు చేసుకోవడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైంది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 9 శాతం ఎగబాకి రూ.7,497.17 కోట్లకు చేరుకున్నది. వీటిలో ఇనుప ఖనిజం అమ్మకంతో రూ.6,350.49 కోట్ల నిధులు సమకూరగా, ఇతర మినరల్స్ విక్రయించడంతో రూ.662 కోట్ల నిధులు సమకూరాయి. రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.1 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది.

# కుప్పకూలాయి..

### 82 వేల దిగువకు సెన్సెక్స్ • 25 వేల కిందకు నిఫ్టీ

ముంబై, మే 27: స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. బ్యాంకింగ్, ఐటీ, వాహన రంగ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో వరుసగా రెండు రోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలు భారీగా నష్టపోయాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 82 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 624.82 పాయింట్లు కోల్పోయి 81,551.63 వద్ద స్థిరపడింది. 30 సూచీల్లో 25 షేర్లు నష్టపోగా,



కేవలం ఐదు సూచీలు లాభపడ్డాయి. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 174.95 పాయింట్లు కోల్పోయి 24,826.20 వద్ద స్థిరపడింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాల్లోకి నెట్టాయి. దీంతో ఇరు సూచీలు ఒక్క శాతానికి పైగా కోల్పోయి, చివర్లో భారీ నష్టాలను తగ్గించుకోగలిగాయి. పారిశ్రామి, తయారీ రంగ గణాంకాల విడుదలకుముందు మదుపరులు ముందస్తుగా అమ్మకాలకు మొగ్గుచూపడం సూచీల నష్టాలకు ప్రధాన కారణమని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. బుధవారం పారిశ్రామిక, తయారీ రంగ గణాంకాలతోపాటు ఈ వారం చివర్లో దేశ జీడీపీ గణాంకాలు కూడా విడుదలకానున్నాయి. సూచీల్లో అల్ట్రాటెక్ సిమెంట్ గరిష్ఠంగా 2.21 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ 2 శాతం, టాటా మోటర్స్, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్, మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు నష్టపోయాయి. కానీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, నెస్లె, ఏషియన్ పెయింట్స్‌లు మాత్రం కోలుకున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఊగిసలాటలో కదలాడాయని, ఆసియా మార్కెట్లు బలహీనంగా ఉండటం సూచీల పతనానికి కారణమైందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రంగాలవారీగా ఎఫ్ఎంసీజీ, ఐటీ, వాహన, బ్యాంకింగ్, యుటిలిటీ, మెటల్ రంగ షేర్లు పతనం చెందాయి.




## బీఎస్ఎన్ఎల్ లాభం 280 కోట్లు

న్యూఢిల్లీ, మే 27: ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరోసారి లాభాల్లోకి వచ్చింది. వరుసగా రెండోసారి మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.280 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.849 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. 18 ఏండ్ల తర్వాత వరుస త్రైమాసికాల్లో లాభాలను ప్రకటించడం ఇదే తొలిసారని కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాధిత్యా సింధియా తెలిపారు. 2007 తర్వాత వరుస త్రైమాసికల్లో లాభాలను నమోదు చేసుకోవడం విశేషమన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలోనూ సంస్థ రూ.262 కోట్ల లాభాన్ని గడించిన విషయం తెలిసిందే. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ సహాయ సహకారాలు అందించడం వల్లనే లాభాల్లోకి రాగలిగామని బీఎస్ఎన్ఎల్ సీఎండీ ఏ రాబర్ట్ జే రవి తెలిపారు.

# ఎల్ఐసీ లాభం 19,013 కోట్లు

### క్యూ4లో 38 శాతం పెరిగిన ప్రాఫిట్




న్యూఢిల్లీ, మే 27: దేశీయ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.19,013 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.13,763 కోట్లతో పోలిస్తే 38 శాతం వృద్ధిని కనబరిచినట్టు పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2,50,923 కోట్ల నుంచి రూ.2,41,625 కోట్లకు తగ్గింది. దీంట్లో తొలి-ఏడాది ప్రీమియం వసూళ్లు రూ.13,810 కోట్ల నుంచి రూ.11,069 కోట్లకు తగ్గినట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. అలాగే రెన్యూవబుల్ ప్రీమియం వసూళ్లు రూ.77,368 కోట్ల నుంచి రూ.79,138 కోట్లకు పెరిగాయి. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.8,84,148 కోట్ల ఆదాయంపై రూ.48,151 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా మంగళవారం సమావేశమైన కంపెనీ బోర్డు..ప్రతి షేరుకు రూ.12 తుది డివిడెండ్‌ను అందిస్తున్నట్టు ప్రకటించింది. అలాగే పాలసీహోల్డర్లకు రూ.56,190 కోట్ల బోనస్ చెల్లింపులు జరపనున్నట్టు పేర్కొంది.



ఈ సందర్భంగా ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్దార్థ మొహంతీ మాట్లాడుతూ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సవాళ్లు ఉన్నప్పటికీ వృద్ధిని నమోదు చేసుకున్నట్టు, తొలి ఆరు నెలల్లో ఆశాజనక పనితీరు కనబరిచినట్టు చెప్పారు. పలు ఉత్పత్తులను మళ్లీ విడుదల చేయడం కలిసొచ్చిందన్నారు. హెల్త్‌కేర్ రంగంలోకి అడుగుపెట్టడంలో భాగంగా వాటా కొనుగోలుపై ఆయన స్పందిస్తూ..ప్రస్తుతం ఇది చర్చల దశలో ఉన్నదని, వచ్చే రెండు నుంచి మూడు నెలల్లో బోర్డు నిర్ణయం తీసుకుంటుందన్నారు.

# విదేశీ పెట్టుబడులు డౌన్

### జనవరి-మార్చి మధ్యకాలంలో 24 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ, మే 27: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో కేంద్రం పూర్తిగా విఫలమవుతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 24.5 శాతం తగ్గి 9.34 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో భారత్‌లోకి 12.38 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. అంతర్జాతీయ దేశాల ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో దేశీయంగా పెట్టుబడులు పెట్టడానికి విదేశీ ఇన్వెస్టర్లు వెనుకంజవేస్తున్నారు. కానీ, 2024-25 ఆర్థిక సంవత్సం మొత్తానికి ఎఫ్‌డీఐలు 13 శాతం పెరిగి 50 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. సింగపూర్ నుంచి అత్యధికంగా 14.94 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు రాగా, మారిషస్ నుంచి 3.73 బిలియన్ డాలర్లు, అమెరికా నుంచి 5.45 బిలియన్ డాలర్లు, నెదర్లాండ్స్ నుంచి 4.62 బిలియన్ డాలర్లు, యూఏఈ నుంచి 3.12 బిలియన్ డాలర్లు, జపాన్ నుంచి 2.47 బిలియన్ డాలర్లు, బ్రిటన్ నుంచి 795 మిలియన్ డాలర్లు, జర్మనీ నుంచి 469 మిలియన్ డాలర్ల మేర ఎఫ్‌డీఐలు వచ్చాయి. మొత్తం ఎఫ్‌డీఐల్లో సింగపూర్ వాటా 30 శాతంగా ఉండగా, మారిషస్ వాటా 17 శాతం, అమెరికా వాటా 11 శాతంగా ఉన్నది. ట్రేడింగ్, టెలికాం, ఆటో, నాన్-కన్వెన్షనల్ ఎనర్జీ, కెమికల్స్ రంగాల్లోకి పెట్టుబడులు వచ్చాయి.

### అమెరికాలో బీఆర్ఎస్ రజతోత్సవాలకు

## మాజీ మంత్రులు కేటీఆర్, కొప్పుల



విమానాశ్రయంలో కేటీఆర్‌తో కొప్పుల, కోరుకంటి, కోలేటి దామోదర్

గోదావరిఖని/జూలపల్లి, మే 27: అమెరికాలోని డల్లాస్‌లో జూన్ 1న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవం, బీఆర్ఎస్ రజతోత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అమెరికాకు బయలుదేరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ విమానాశ్రమం నుంచి తరలివెళ్లారు. వీరితో పాటు పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ అమెరికాకు వెళ్లారు.

### హక్కులు అమలు చేయాలి

రామగిరి, మే 27: సింగరేణిలో పని చేస్తున్న సులభ్ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులను అమలు చేయాలని ఆర్జీ-3 డీజీఎం పర్సనల్ సుదర్శన్‌కు వినతి పత్రం అందజేశారు. పీఎఫ్, బోనస్, వైద్యం, బీమా గత సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న వీడీఏ ఏరియర్స్ తదితర హక్కులను వెంటనే అమలు చేయాలని కోరుతూ జూన్ 5న కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు పుష్ప, రాధ, విజయ, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఖనిలో తిరంగా యాత్ర

ఫర్టిలైజర్‌సిటీ, మే 27: పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులపై ఇటీవల భారత ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయవంతంతో మంగళవారం గోదావరిఖనిలో విశ్వహిందూ పరిషత్ మహిళా విభాగం ఆధ్వర్యంలో తిరంగా యాత్ర జరిగింది. జాతీయ జెండాలతో మహిళలు పెద్ద ఎత్తున పట్టణంలో భారత్ సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఇక్కడ మహిళా విభాగం బాధ్యులు సూర్యదేవర జ్యోతి, కోట తిరుమల, ఆరెల్లి మమత, విశ్వహిందూ పరిషత్ నగరకార్యదర్శి మ్యాడగోని రవీందర్, మాతృశక్తి నగర సంయోజిక భవానీ, కోట తిరుమల, దీప్తి, ఇందిరా, ప్రమీల, మల్లేశ్వరి, వర్షిత, భాగ్యలక్ష్మీ, తదితరులు ఉన్నారు.

### పోషకాహారంతోనే చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ..!

కమాన్‌పూర్, మే 27: పోషకాహారంతోనే చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని అంగన్‌వాడీ టీచర్లు గుమ్మడి శారద, రబియా, లక్ష్మి అన్నారు. రొంపికుంటలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం పోషణ్ పక్వాడా నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన,పోషక విలువలు గల ఆహార పదార్థాలపై అవగాహన, బాలబాట, సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ములుమూరి తిరుపతి, కే. రాజమణి, గుమ్మడి స్వరూప, శీలం లక్ష్మి, కల్లెపెల్లి శ్రీమాల, కేతలం లక్ష్మి, వడ్లకొండ పుష్పలత, మత్స్య శంకరమ్మలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### 30న పౌరహక్కుల దినోత్సవం

కమాన్‌పూర్, మే 27: మండలంలోని జూలపల్లి గ్రామంలో ఈ నెల 30న పౌర హక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల జాతులపై అంటరానితనం, దేవాలయంలోనికి ప్రవేశం, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి,ప్రభుత్వ కొళాయిల వద్ద అస్పృశ్యత లాంటివి నిర్మూలించడం కోసమే పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు.



కోనరావుపేటలో తారురోడ్డుపై నిల్వ చేసిన ధాన్యం బస్తాలు

## దారెంట ధాన్యం నిల్వలు

జూలపల్లి, మే 27 : కోనరావుపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జూలపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏప్రిల్ 26న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటి దాకా దాదాపు 8 వందల క్వింటాళ్ల ధాన్యం తరలించినట్లు సీఈవో గీస సురేశ్ వెల్లడించారు. మరో 6 లారీల ధాన్యం తూకం వేయాలని పేర్కొన్నారు. నల్ల రేగడి భూముల్లో ఉన్న కేంద్రం ఏర్పాటు చేశారు. వర్షాలకు నేలంతా తడిసి కనీసం నడవ లేకుండా ఉన్నది. ఇక్కడ నిల్వ చేసిన ధాన్యం తూకం వేయడం, తరలించడంలో ఇక్కట్లు తప్పడం లేదు. ఓ వైపు వర్షాలు, మబ్బులకు ధాన్యం తేమ శాతం రాక తూకం వేయడానికి నిర్వాహకులు నిరాకరిస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలు రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నల్ల రేగడి భూముల్లోకి వాహనాలు వెళ్లలేక రైతులు తారురోడ్డుపై నిల్వ చేసుకుంటున్నారు. దారెంటా వడ్ల నిల్వలతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

# గానానికి గాయం..

- పక్షవాతంతో మంచాన పడిన కళాకారుడు కొమురయ్య
- స్వరాష్ట్ర ఉద్యమంలో ఎన్నో పాటలు పాడి...
- నేడు అచేతన స్థితిలో కొట్టుమిట్టాడి...
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న దంపతులు

కోల్‌సిటీ, మే 27: గాయకుడికే గాయమైంది..నాడు స్వరాష్ట్ర ఉద్యమంలో ఎన్నో పాటలు పాడి...ఉర్రూతలూగించిన ఆ గొంతు ఇప్పుడు పాడలేక పోతుంది... దిక్కుతోచని స్థితిలో అచేతన స్థితిలో కొట్టుమిట్టాడుతోంది..మళ్లీ పాడుతానా..? లేనా అన్న ఆశ కూడా రోజు రోజుకూ సన్నగిల్లుతోంది.. ఒకవైపు పేదరికం..మరోవైపు అనారోగ్యం మరింత కుంగదీస్తోంది..ఇప్పటికే వైద్య ఖర్చుల కోసం ఇంట్లో ఉన్న వస్తువులు సైతం అమ్ముకునే పరిస్థితి వచ్చింది... అయినా విధి కరుణించక... అనారోగ్యంతో మంచాన పడేసింది..ఆయనెవరో కాదు... ఒకప్పుడు ఉద్యమాలలో తన ఆట..పాటలతో గళం విప్పిన అరుణోదయ కళాకారుడు సంబోదుల కొమురయ్య. ప్రజా కళాకారుడు కొమురయ్య భార్య రాజేశ్వరితో జనగామ గ్రామంలో ఉంటున్నాడు. వీరికి సంతానం లేదు. కాగా, చిన్నప్పటి నుంచి పాటలు పాడటంతో కళాకారుడిగా కొమురయ్యకు పేరుంది. చిన్నప్పటి నుంచే పోలియో వ్యాధి ఉన్నప్పటికీ ఏమాత్రం జడవకుండా అరుణోదయ కళాకారుడిగా జీవితంను కొనసాగిస్తూనే గోదావరిఖని సూపర్ బజార్‌లో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తున్నాడు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఎన్నో పాటలు పాడిన కొమురయ్యపై విధి మరోసారి చిన్నచూపు చూసింది. రెండు నెలల క్రితం హఠాత్తుగా పక్షవాతం బారినపడ్డాడు. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్యంకు ఇప్పటికి రూ.4లక్షల వరకు ఖర్చు చేశారు. ఆఖరికి ఇంట్లో ప్రతి వస్తువు కూడా అమ్ముకొన్నారు. ఇక చేతిలో చిల్లి గవ్వలేక నిన్ననే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చాడు. దాతలు స్పందించి ఆపన్నహస్తం అందిస్తే మళ్లీ వైద్యం చేయించుకుంటానని చేతులెత్తి మొక్కుతున్నాడు.



పక్షవాతంతో మంచానపడి దీనస్థితిలో కళాకారుడు కొమురయ్య

### సీనియర్ కార్మిక నేత

## బాసాని రాజయ్య మృతి

మంథని, మే 21: హమాలీ సంఘం కార్మిక నేతగా, టీడీపీ సీనియర్ నాయకుడిగా మంథని డివిజన్ ప్రజలం దరికీ సుపరిచితుడైన బాసాని రాజయ్య(85) సోమవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక మర్రివాడకు చెందిన బాసాని రాజయ్య వృద్ధాప్యంతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కన్ను మూశారు. కరీంనగర్‌లోని ఓ ఆసు పత్రికి కుటుంబ సభ్యులు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంథని హమాలీ సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పని చేసిన బాసాని రాజయ్య డివిజన్‌లోని హమాలీ హక్కుల సాధన కోసం, వారి సంక్షేమం కోసం దాదాపు 30ఏళ్ళు పైగా పోరాటం చేశారు. టీడీపీలో నైతం రాజకీయ కార్యకలాపాల్లో పలు సామాజిక అంశాలపై చాలా కాలం పాటు చురుకుగా పని చేశారు. అదే విధంగా మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి సైతం తన వంతు కృషి చేశారు. బాసాని రాజయ్య అంతిమయాత్రలో రాజయ్య మృత దేహంపై సీపీఐ నేత గణేష్ ఆధ్వర్యంలో ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు రాజయ్య మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

### గుండెపోటుతో

## బీఆర్ఎస్ నాయకుడి మృతి

ధర్మపురి, మే 27: బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రధాన అనుచరుడు, ధర్మపురి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అక్కెనపల్లి సునీల్‌కుమార్(48) సోమవారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతి చెందారు. కుటుంబసభ్యులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఏసీ ఆఫ్ చేద్దామని సునీల్ భార్య అనిత నిద్రలేచింది. అప్పటికే సునీల్ నోటిలోంచి నురగ లాంటి ద్రవం వస్తున్నట్లుగా కనిపించింది. వెంటనే నిద్రలేపే ప్రయత్నం చేసినప్పటికీ అచేతన స్థితిలో ఉండడం గమనించి ఆందోళనకు గురైంది. వెంటనే బంధువులకు, సునీల్ స్నేహితులకు ఫోన్ చేసి విషయం తెలిపింది. వెంటనే వారు చేరుకొని అచేతన స్థితిలో ఉన్న సునీల్‌ను జగిత్యాల దవాఖాకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. అందరితో కలివిడిగా ఉండే సునీల్ మృతి పట్ల నియోజకవర్గంలో విషాదం నెలకొన్నది. సునీల్ అంత్యక్రియల్లో వేలాది మంది పాల్గొని అంతిమ వీడ్కోలు పలికారు. 'సేటు వెళ్లిపోయావా' అంటూ ఆయనతో సాయం పొందిన పలువురు బోరున విలపించారు.

## సర్వీసింగ్ సెంటర్ అద్దెకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కమాన్, మే 27 : పెద్దపల్లి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ)లో గల సర్వీసింగ్ సెంటర్‌ను అద్దె నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వారు ఎవరైనా రూ. 15వేల (ఈఎండీ) డీడీని ప్రిన్సిపాల్ ప్రభుత్వ ఐటిఐ పెద్దపల్లి పేరిట తీసి కళాశాలలో ఈ నెల 28 నుంచి జూన్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నా రు. ఏడాది పాటు అద్దె నిర్వహణ కోసం జూన్ 6న వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9703113881, 9989616132 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ కీలకం



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి, మే27: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో జిల్లా కలెక్టర్, అధికారులు కీలకపాత్ర పోషించి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వ్యవసాయ శాఖ వంటి పలు అంశాల పై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణా రావుతో కలిసి సీఎం హైదరాబాద్ సీఎం కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. వీసీలో పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ దాసరి వేణు, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు బీ గంగయ్య, కే సురేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వరుస చోరీలతో హడలెత్తిస్తున్న దొంగలు

- పెద్దపల్లి భూంనగర్‌లో తాళాలు వేసిన రెండు ఇండ్లలో చోరీ
- సీసీ కెమెరాలున్నా దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలం

పెద్దపల్లి టౌన్, మే 27: పట్టణంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాళలు వేసిన ఇండ్లే టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో భూంనగర్, వెంకటేశ్వర అపార్టుమెంట్‌లోని రెండు ఫ్లాట్లలో నివసిస్తున్న కొట్టే శ్రీవిద్య ఇంట్లో 58 గ్రామల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి, రూ. 30వేల నగదు, మొత్తం రూ. 2.77 లక్షలు అహపరించారు. గండు అనూష ఇంట్లో 8 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 వందల గ్రాముల వెండి, రూ. 10వేలు దొంగలు ఎత్తుకెళ్లారు. రెండు ఫ్లాట్లలో మొత్తం రూ. 3,28,480 సొత్తు అపహరణకు గురైనట్లు సమాచారం. వేసవి సెలవుల రీత్యా ఒకరూ విదేశీ పర్యటనలో ఉండగా, మరొకరు తీర్థయాత్రలకు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. దీన్ని ఆసరా చేసుకున్న దొంగలు ఫ్లాట్స్ వెనుక భాగం నుంచి తాళాలు పగులగొట్టి ఇంట్లోని బంగారు ఆభరణలు, నగదు ఎత్తుకెళ్లిన్నట్లు స్థానికులు తెలిపారు. సంఘన స్థలానికి సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు లక్ష్మణ్‌రావు, మల్లేశ్, క్లూస్ టీం బృందం చేరుకొని ప్లాట్స్‌లో వివరాలు చేశారు. పరిసరాలను తనిఖీ చేశారు. పది రోజుల క్రితం ఏటీఎంలో దొంగలు పడి నగదు ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. ఇదే తరహాలో ఓ ఇంట్లో చొరబడి రెండు మొబైల్ ఫోన్లు ఎత్తుకెళ్లారు. ఈ రెండు చోరీలు మరువక ముందే రెండు ఫ్లాట్లలో దొంగతనం జరుగడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. పట్టణంలో 250 వరకు సీసీ కెమారాలున్నా చోరీలు నియంత్రించలేకపోతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణంలో పెట్రోలింగ్ చేయకపోవడం, నిఘా నేత్రాలున్నా దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనే ఆరోపనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికై పోలీసులు దొంగతనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వెంకటేశ్వర అపార్టుమెంట్‌లో జరిగిన దొంగతనంపైన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తేన్నారు. ఇక్కడ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు లక్ష్మణరావు, మల్లేశ్, క్లూస్ టీం సభ్యులు ఉన్నారు